# ధర్మసాధని

[బ్రాహ్మసాధనాశ్రమ పక్షమున ప్రతిశనివారము ప్రకటింపబడును.]

ధర్మంచర । ధర్మాత్ పరం నాస్తి । ధర్మః సర్వేషాం భూతానాం మధు.

సంపుటము ౮. | 12 1921 కాకినాడ:—శనివారము, ౧౨, ఫిబ్రవరి, ౧౯౨౧. | చందా సం॥ రు ౩.

సంచిక ౭. | విడిసంచిక అ ౧.

## ఓమ్.

“సీ॥ ఈపాపదావాగ్ని నేమిట నార్తును
నీమంజువాగ్వృష్టి నెగడ దేని ?
ఈకల్మషాంబోధి నేతో్రవ గడతును
నీసేవ నావయై నిలువ దేని ?
ఈపాతకధ్వాంత మేజాడ జెఱుతును
నీహాసచంద్రిక నిగుడ దేని ?
ఈకిల్బిషజ్వర మేభంగి నడతును
నీదయామృతమును నింప వేని ?

ఆ॥ ఎట్లు నిర్వహింతు? మేలాగు మాలాగు ?
కరుణ సేయ వేని, గదియ వేని,
దిక్కెవండు మాకు ? దీనచింతామణి!
ఏమి సేయువార మింక నీశ !”

---

సోమరితనమువలన పెక్కులు దుర్గుణములు పట్టుపడును; అందువలన నట్టిమనుష్యులు సమస్త పాపములకును కుదురగుదురు. ఇహలోక సౌఖ్యమునకును కొలదికి మీరిన ధనముగాని ప్రభుత్వసంపదగాని యక్కఱలేదు. సత్కార్యాచరణమువలన ఈలోకము నందును సమస్తలాభములును సౌఖ్యములును గలుగును. పరలోకమునందును శాశ్వతమయిన సుఖము లభించును. కాబట్టి యిహమునందు సౌఖ్యము కలుగు వానివలననే పరమునందును సౌఖ్యము లభించును. అట్లగుటచేత మనబుద్ధి యెప్పుడును సత్కార్యమునందే తగిలియుండునట్లును మన మెప్పుడును సత్కార్యములనే చేయుచుండులాగునను చేయ నీశ్వరుని ప్రార్థింతము.

కం. వీరేశలింగకవి.

---

## భాగవతము.

ధర్మగ్రంథములను జదువుచు వినుచుండుటవలన మిక్కిలి మేలు గలుగును. భగవానుని స్వరూపవర్ణమును, లీలాకీర్తనమును, శక్తిప్రచారమును, భక్తులచారిత్రములుగల గ్రంధములను జదువుటవలనను వినుటవలనను చిత్తము భక్తిమార్గమునం దగ్రేసర మగుచుండును. ఇందువలననే చైతన్యుడు భాగవతమును ప్రధానసాధనముగ నుడివియున్నాడు. ఇతిహాసమును, విజ్ఞానశాస్త్రము మొదలగునవి భగవానుని లీలలను మహిమను వెల్లడించి యీశ్వరభక్తిని గలిగించును. కావున నీగ్రంథములు గూడ భాగవతముగనే పరిగణింపబడును. గ్యాలన్ అను విఖ్యాత ప్రతీచ్య పండితునకు భగవానుడు గలడను విశ్వాసము లేకుండెను. కాని యితడు మానవదేహతత్త్వమును పరిశీలించుటవలన మనుష్య శరీరము యొక్క, అశ్చర్యఘటనా విధానమును, నరములు, ఎముకలు, మాంసము మొదలగు వానియొక్క రచనా కౌశలమును, జూచి భగవద్భక్తుడై యీశ్వర మహిమ సంబంధమునం దతిమనోహర మగు గ్రంథమును రచించెను. సత్సాంగత్యము చేయుటకు వీలులేనివారలు భాగవతమును పఠించుచుండినయెడల నాలోపమును నివారితమగును.

భక్తియోగము.

---

# విషజ్వర చరిత్రము.

—o—

[ శిరశి, ఆంజనేయులు – తెనుగుపండితుడు. ]

III

## ౭ అల్ప ప్రమాద మధికనష్టమునకు గారణము.

మానవుని రక్తము నుండియు కఫము నుండియు నితర మార్గముల నుండియు నీజాడ్య సంబంధములగు క్రిము లుత్పన్నము లగుచున్నట్లు, పరాసురంగము నందలి జూలై ౧౩. ౨౦ వ తేదీల నాటి యాంగ్ల సైనికులు కనుగొనిరి. రోగగ్రస్థుల దాకుట వలనను, క్షుతి కాసాదుల వలనను, నిది సులభముగ నత్యంత తీవ్రముగ మానవుడు గ్రహింపజాలని యంతటి త్వరలో క్షణములో నంటుకొనును. కావున నీవ్యాధియుండు తావులకు జనసమ్మర్దముగల బండ్లలో బ్రయాణము సేయుట మిక్కిలి యపాయకరము. అల్పప్రమాదమువల్లన జరిగిన యొక దారుణాపాయము నిందుల కాదర్శముగ జూపుట యుక్తము. ధర్మవరమున విషజ్వర సంబంధమైన పొలకువయే లేని సందర్భమున గార్యాంతరులగు సోదరులు నలువురు ౧౯౧౮ వ సంవత్సరము సెప్టెంబరు నెల ౨౧ వ తేది రాత్రి యనంతపురమునకు వెళ్ళవలసి వచ్చినది. ఆసందర్భమున మామండలము నందందు విషజ్వర బీజములు మొలకలెత్తియే యుండెను. వారు బయలుదేఱిన నాటి రాత్రి బండిలో నిలుచుండుటకే యెడములేని రీతిని పాంథులు క్రిక్కిరిసి యుండినను, మఱియొక బండికై వేచియుండుట నిద్రాభంగమునకు గారణమగునని తలంచి, వారా యొత్తిడి సమయముననే యనంతపురమునకు వెళ్ళి, భానువారమచ్చట బనిదీర్చికొని నాటిరాత్రి మేలుబండిలో బయలువెడలి యూరుచేరిరి. మఱునాటియుదయమే వారికి జలుబుచేసినట్లు కనబడినది. అదియే రోగాంకురమని తెలియలేదు. వారునలువురు నిట్లు వ్యాధిగ్రస్థులయి దారుణవేదన ననుభవించి మరల మృత్యుముఖమునుండి వెలువడినను వ్యాధిమాత్ర మెవ్వరికిని దెలియకయే కుటుంబమునకును బొరుగువారికిని నితరులకును నంటి, క్రిమక్రమముగ బురమునందంతట నల్లుకొని, భయంకరాకృతి దాల్చుటకు హేతువయ్యెను.

## ౮ వ్యాధి కుసికిపట్టు.

జన సమ్మర్దము గల చోట్లను—అనారోగ్య ప్రదేశముల యందును—అనాగరికులలోను—విషజ్వరము మఱింత వేగముగ వృద్ధియగును. చాలినన్ని కిటికీలు లేని చిన్నని చీకటి గదులలో బెక్కండ్రు నివసించుటచేతను—మంచిగాలియు వేళకు దగిన భోజనమును మందులును లభింపక పోవుటచేతను—పథ్యపానాదులు జరపుకొనెడిశక్తి చాలనందునను—బీదలీవ్యాధి కెక్కుడుగ గుఱియగుట సంభవించునని వెనుక విన్నవించియుంటిమి. ఇటీవల బెంగుళూరియందొక కూలివాడు తన భార్యాపుత్రాదులందఱు నొకేపర్యాయము జ్వరపీడితులగుట భరింపజాలక, తటాకమున బడి యసువుల గోలుపోయిన వృత్తాంత మిందులకు దార్కాణముగా గలదు. ఆపురమున నిరువది యైదు వేలమంది కీజ్వర మంటియుండెడిది. ఈపరిస్థితులలో నిరుపేదల వ్యవహారము మిక్కిలి ఘోరమై పోయెను.

## ౯ వేగము నాపుట.

ఈయంటువ్యాధి యొక గ్రామమున బొడచూపి, బహుతీవ్రముగ నొకరినుండి మఱియొకరి కంటుకొని యచిరకాలముననే యాయూరియందంతటను నావరించి, యుద్రేకించుట దీని స్వభావమని మన మెఱుంగుదుము. జనులు దాని నాపుటకై చేయు ప్రయత్నములు వ్యర్థములే యైనను, వేడిని దగ్గించుటకు మాత్రము కొన్ని సదుపాయములున్నవి. సాధ్యమగునేని జనులందఱు నూరు విడిచి కొంతకాలము వెలుపల నుండుట మంచిదే. అనేకుల [illegible]ది సాధ్యము కాకపోవచ్చును. రోగాంకుర మగుపడిన గ్రామముల యందలి నాయకు లందలి పాఠశాలలను– వర్తక సంఘములను- వినోదరంగములను– నిలుపుటబాగు. జనులందరు ముఖ్యముగ వారివారి శరీర సౌకర్యమార్గములయందు దృష్టియుంచవలయును. ప్రార్థనాలయములు– దేవాలయములు_ గానసభలు- నాటకశాలలు– మున్నగుచోట్లకు వెళ్ళకుండుట, జనసమ్మర్థముగల బండ్లలో బ్రయాణము సలుపకుండుట, సామంజస్యము. ఇట్టి తఱిని బ్రతిమానవుడును దన కాలములో విశేషభాగము వాయుసంసేవనమున గడపుటయే క్షేమకరము. బీదల కిది యత్యంత కష్టము. రోగాంకుర మగుపడినప్పు డేమాత్ర మశ్రద్ధ వహించినను వేలకొలది మరణములకది మూలమగును; కావున నారోగ్యశాఖవారు వైద్యాధికారులు నిట్టితరుణములలో మిక్కిలి శ్రద్ధవహింపవలసియున్నారు. ముఖ్యముగా బురపారిశుద్ధ్యసంఘమువారు దయామయులై వేదనోపశమనమునకై పలు దెఱగుల బాటుపడవలయును. వీరు కడపటకు రోగము నాపుదలచేయు ప్రయత్నమందే యుండక రోగవ్యాప్తికి గల కారణ మారసి దాని సున్మూలింప గృషి సలుప వలయును. సంఘసేవాసమితి తోడ్పాటు సహిత మిందుల కత్యావశ్యకము. రోగుల సంఖ్యలో నెక్కువభాగమునకు వీరు తోడ్పడవలసి యున్నారు. ఈసందర్భమునయందు, కుగ్రామవాసులస్థితి చాల విషమముగ నుండును. వారిధిగ్రస్థులై యధిక సంఖ్యాకులు బాధపడుటయు నచ్చటనే; కావుననే సేవాసమతి నిర్వ్యాజమగు ప్రేమతో బనిచేసి, వారకష్టముల దొలగింప వలయును. గ్రామములలోని ప్రతిగృహమును సందర్శింపవలయును. దేహ–వస్త్ర-పదార్థ–పాత్ర- స్థలాదుల పారిశుద్ధ్యతను గూర్చి మోటు జనులకు జక్కగా నచ్చచెప్పవలయును, మందులయందును జికిత్సలయెడలను వారికి నమ్మకము పుట్టింపవలయును. ఇట్టి ప్రయత్నముల వలనను, ఉత్తమ చికిత్సల వలనను, వ్యాధియురవడిని గొంతవఱకు నాపవచ్చును. నూరుల కొలది ప్రాణులను బ్రదికింపవచ్చును; కాని ప్రజాపీడన జన్య మహాపాతక కారణమున ఇట్టిజ్వరము లుత్పన్నములగునని యు, మహా రుద్రజపమునైన సహస్ర ఘటాభిషేకమునైన జేయుట వలన నివి శాంతించుననియు గొందఱాయుర్వేద శాస్త్రజ్ఞులు నుడువుచున్నారు.

## ౧౦ రోగ లక్షణములు.

ఈవ్యాధి జలుబుతో నారంభించును. క్షణ క్షణమునను జలుబెక్కుడగును. దగ్గు కొలదిగ బొడచూపును. నీరస మెక్కుడై పరుండవలెనను బుద్ధిపుట్టును. కన్నులు నిప్పులవలె నెఱ్ఱనగును.

కంఠబాధయు శిరోవేదనయును విస్తారమగును. పిమ్మట జ్వరము ప్రారంభమై ౧౦౩, ౧౦౪ అంశములవరకు హెచ్చును. వెన్నులాగుట—కాళ్ళీడ్చుట—చిత్తభ్రమ—మూర్ఛ—కీళ్లపోట్లు—కాన్పించును. కాస మధికమై కఫముతో నెత్తురు పడుటయు సంభవించును. ముక్కువెంబడి మలముతోగూడ రక్తముపడి, భీతిని గల్గించును. ఊపిరితిత్తులు పట్టుకొనును. నోట నొకవిధమగు దుర్గంధము వెలువడుచు నసహ్యము దోపించును. ఆహారము రుచింపదు. నాలుక పిడుచకట్టును. విస్తారభేదులైనను, అథవా వమనమైనను, లేక రెండునైనను గలుగవచ్చును. మూత్రము బంధించును. లేదా యెఱ్ఱగాను వేడిగాను బోవుచుండును. ఈవ్యాధికిని లక్షణములై యుండును. హృదయరోగమున్న వారికిని యెక్కువ యపాయము గలిగించును.

---

# హిందూమత సిద్ధాంతము-పరమాత్మ.

[సి. సి. మజుందారు గారు.]

V

పరమాత్మయే సమస్తమునకు మూలాధారమై సమస్తమును నిండి, సర్వాత్మల ఉత్పత్తికి కారణమై, సర్వాత్మలను బోషించుచు వెలయుచున్నది.

శ్లో॥ యథోర్ణనాభిః సృజతే గృహ్ణతేచ
పురుషాత్ కేశలోమానితథా క్షరాత్
సంభవతీహ విశ్వమ్॥

సాలెపురుగు తనయందు వేరొక సహాయము లేక యేదారములను సృజించి ఎట్లు తన రూపముగానే చేయునో, జీవించియుండిన పురుషుని వలన వానికి వేరగు జడములైన వెండ్రుకలెట్లు శిరోదేహములందు పుట్టుచున్నవియో ఆప్రకారము సమస్త జగత్తు నాశనరహితమైన ఆపరమాత్మనుండి అసహాయమై, అభిన్నమై, విలక్షణమై ఉద్భవించుచున్నది.

శ్లో॥ యథాసుదీప్తాత్ పావకా ద్విస్ఫులింగాః
సహస్రశః ప్రభవన్తే సరూపాః । తథాక్ష
రాద్వివిధాః సోమ్యభావాః ప్రజాయన్తే
తత్రచైవాపియన్తి॥

ప్రకాశించి మండుచుండెడి అగ్నివలన మిణుగుఱులు ఆ అగ్నికి సమానరూపము కలవై ఎట్లు జన్మించునో ఆప్రకారము ఆ అక్షర పరబ్రహ్మమునుండి అనేకవిధములగు జీవములు ఆపరబ్రహ్మమునకు సమానమై పుట్టి దానియందే లీనమగుచున్నవి.

శ్లో॥ యథా నద్యస్స్యన్దమానాస్సముద్రే అ
స్తంగచ్ఛన్తి నామరూపేవిహాయ । తథా
విద్వాన్నామరూపాద్విముక్తః పరాత్పరం
పురుషముపైతి దివ్యమ్॥

నామరూపములను ధరించి ప్రవహించుచున్న మహానదులన్నియు సముద్రమునందు చేరి వాటివాటి నామరూపములను విడిచి ఎట్లు అగమ్యములగుచున్నవో ఆప్రకారము ఆత్మస్వరూపమును దెలిసికొన్న జ్ఞాని కల్పితములగు నామరూపములనుండి విముక్తుడై స్వయం ప్రకాశమైనట్టి, పరాత్పరమైనట్టి అద్వితీయమైనట్టి పరిపూర్ణమగు బ్రహ్మమును బొందుచున్నాడు.

ఆకాశములను భేదించుచు, మహోన్నతములగు పర్వతములను మొదలంట కదలించుచు, భూకంపములతో సృష్టియందు ప్రళయము సాగించుచు, మహాసముద్రములను భీతిల్లునటుల నుప్పొంగించుచు, భయంకర శబ్దములకు, భీషణస్వరూపములకు నాలవాలమగునట్లే సృష్టిని దుష్టభూయిష్టముగా చేసి మహాభీకరాకృతిదాల్చి వెలయువాడు కాడీశ్వరుడు. సంపూర్ణముగ ఈశ్వరుడు "భయానాంభయం భీషణం భీషణానామ్" అనునట్లు గాక సచ్చిదానంద స్వరూపుడై ప్రేమ నిలయుండై, పవిత్రస్వరూపుడై పరమపురుషుడై వెలయుచున్నాడు. సమస్తమునకు ఆదికారణుడై, సర్వమునుదానై, సర్వజీవములకు, రూపములకు జీవమై, రూపమై వెలుగొందుచున్నాడు. ఋషీశ్వరుల తపస్సులుగను, విశ్వాసకుల శాసనకిలగన, తనంతట తాను మారుచు, తిర్గి మతగ్రంథముల ద్వారా వ్యక్తీకరించుకొనుచు త్యాగులలో నెల్ల త్యాగియై విరాజిల్లుచున్నాడు పరమేశ్వరుడు. హిందూమతము నిరూపించినటుల మరియొక మతము ఈశ్వరవ్యాపకత్వమును నిరూపించలేదు. ఎయ్యది ఆధ్యాత్మిక స్వయం కృత్యములవల్ల ఈశ్వరశక్తి రూపముదాల్చి కన్నుల పండువుగ విరాజిల్లుచున్నదో అయ్యదియే ఈవిశ్వము. సమస్త ప్రపంచములందును, వివిధగోళములందును ఒక్కశక్తిస్వరూపమే, ఒక్కసత్యస్వరూపమే, ఒక్కశివస్వరూపమే, ఒక్కసుందరస్వరూపమే, ఒక్కప్రేమస్వరూపమే కలదా? అయ్యదియే పరమాత్మ. హిందూమత సిద్ధాంతము ప్రకారము పరమాత్మ సర్వవ్యాపకుడు, సర్వాంతర్యామి. ఈపరమాత్మయే సమస్త ప్రాణికోటిని బంధించి వైచుచున్నది.

చ. స.

---

సత్యమేవ జయతే.

ధర్మసాధని

శనివారము, ౧౨, ఫిబ్రవరి, ౧౯౨౧.

## బ్రాహ్మసమాజ స్థాపకు లెవరు?

---o:-:o:-o---

బ్రాహ్మసమాజము ప్రతిష్ఠించిన మహనీయుల నామములు ఆంధ్రులకు చిరపరిచితములె. రాజా రామమోహనరాయలు, మహర్షి దేవేంద్రనాధ ఠాకూరు, బ్రహ్మానంద కేశవచంద్రసేను, పండిత శివనాధశాస్త్రి బ్రాహ్మసమాజ స్థాపకులలో నగ్రగణ్యులని అందరికి తెలియును. ఇప్పుడొక విషయము విచారణకు వచ్చుచున్నది. పాశ్చాత్యవ్యామోహము ఆంగ్లేయుల సహవాసముచే హిందువులకు కలిగెననియు, అట్టి వ్యామోహ గ్రస్తులైన ఆంగ్లమానసపుత్రులె బ్రాహ్మసమాజ స్థాపకులును అనియు, కొందరు ప్రకటించుటకు ప్రారంభించిరి.

బ్రాహ్మసమాజమును గూర్చి అట్టి తలంపు గలుగుటకు వట్టి ద్వేషమె కారణమని మేము దానిని త్రోసివేయుటలేదు. ఆయభిప్రాయము వెలిబుచ్చువారు సామాన్యముగ బ్రాహ్మసమాజ చరిత్రను బాగుగ తెలిసినవారు గాక ప్రకృత బ్రాహ్మసమాజకుల వర్తనను **మాత్రము చూచువారు.** బ్రాహ్మసమాజకుల ఆచార వ్యవహారములలో పశ్చాత్య వ్యామోహము కొంత కనబడుట వాస్తవము. వారు అది గాంచినతోడనె బ్రాహ్మసమాజ స్థాపకులు ఆంగ్లమానస పుత్రులని, బ్రాహ్మసమాజము జాతీయ సంస్థ గాదని చెప్పుదురు. ఒకసంస్థ నొకరు జాతీయభావ ప్రేరితులై జాతీయపద్ధతుల ననుసరి~~ంచి~~ స్థాపింపవచ్చును. దాని ననుసరించువారియందు పలసిన జీవన పరివర్తనము బాగుగ కలుగక పోవచ్చును. నేడు మనము చూచుచునేయుందుము. ఒకటి జాతీయ ప్రతిష్ఠయని పేరునుబట్టి యెంతగా తెలియుచున్నను దానికిని విజాతీయ ప్రతిష్ఠకును రూపమునందు తారతమ్యము అంతగా గాన్పింపదు. కారణము భావమునకు, ఆదర్శమునకు అనుగుణమగు పరివర్తనము దానియందు లేకపోవుట. అటులనె బ్రాహ్మసమాజ విషయమునను. దేశమంతయు పాశ్చాత్య వ్యామోహమున చిక్కుకొనిన, బ్రాహ్మసమాజికులు మాత్రము దాని బారినుండి యెట్లు తప్పించుకొనగలరు? బ్రాహ్మసమాజ స్థాపకులు భారతజాతి హృదయకుహరమున జొచ్చి దాని మర్మ మెరింగి అందునకనుగుణముగనె తమ యుద్యమము ప్రారంభించినను, వారిభావము, ఆదర్శము అనుచరులందు మూర్తీభవించుటకు ప్రతిబంధకము కలుగకుండునా? కాన విజాతీయ చిహ్నములు వారి జీవనములందు గాన్పించుట అసహజముగాదు. అవి చూచినంత మాత్రమున, బ్రాహ్మసమాజము విజాతీయ సంస్థయని, దాని స్థాపకులు ఆంగ్లమానస పుత్రులని నుడువుట భావ్యము గాదు.

అసలు బ్రాహ్మసమాజ స్థాపకులు జాతీయవాదులు, జాతీయోద్ధారకులుగాక, ఆంగ్లేయులభావములు, ఆచరణములు అంధముగ స్వీకరించి దేశమున నెలకొల్ప జూచిన వారలా యని యోచింతము. గత రామమోహనుని వర్ధంతి సందర్భమున సంస్కరణోద్యమ స్వరూపమును కొంత విపులముగ వివరించి అతడు జాతీయవాది, జాతీయోద్ధారకుడు అని నిరూపించితిమి. రామమోహనుడు శిష్టాచార సంపన్నుల గృహమున జనించెను; హిందూధర్మ గ్రంథములు కూలంకషముగ పఠించెను; అన్యమత గ్రంథములను చదివెను. అతడు నేర్చిన భాషలలో ఆంగ్లమును కలదు. కాని అతని పాండిత్యము విద్యాలయము లందు గ్రహింపబడినది గాదు. ఇతరుల తోడ్పాటులో స్వయంకృషి మూలముననె అతడు మహా విద్వాంసుడయ్యెను. అతడు ఋషి; అద్భుతశక్తి సంపన్నుడు. అతనిదృష్టి అతిసూక్ష్మము. బాల్యమునసె ఏకేశ్వరోపాసనా ప్రభావము గ్రహించెను. వివిధమత పరిశీలనముచే మతము విశ్వజనీనమని గుర్తించెను. సాంఘిక రాజకీయ సంస్కరణములకై పోరాడినను స్వజాతీయ ప్రకృతికిని తన జీవనమునకును మూలమై ఐహికాముష్మిక సుఖములకు సాధనమైయున్న బ్రహ్మోపాసనమునె బ్రాహ్మసమాజోద్దేశ్యముగ జేసెను. ఉపాసనాప్రణాళికి జాతీయాకారమునె యొసంగెను. హిందువులు తిరిగి యెప్పుడు సర్వస్వాతంత్ర్యములు గలిగి ప్రపంచమున తలయెత్తుదురా యని వాంఛించెను. అట్టి రామమోహనుడు ఆంగ్లమానస

పుత్రుడును, అతడు స్థాపించిన బ్రాహ్మసమాజము విజాతీయమును అగునా? దేవేంద్రనాథ ఠాకూరును గురించి ఒక్కమాట చెప్పిన చాలును. ప్రాచీన మహర్షి యె యాతడని యెల్లరు చెప్పుకొనిరి. విజాతియ వ్యామోహముచే ప్రథమమున కేశవచంద్రాదులు జాతీయ విధానము నెడ విముఖులై యుండినతరి వారిని వారించిన జాతీయసంస్కర్త దేవేంద్రుడు. కేశవచంద్రసేను అనుభవము పొందినకొలది బ్రాహ్మసమాజమును పూర్తిగ జాతీయముచేసెను.

"The future church of India must be *thoroughly* national. There shall be unity of spirit but diversity of forms."

భరతవర్షమునందు రాబోవు ధర్మమండలి పూర్తిగ జాతీయమై యుండవలెను; భావమున నేకత్వము, ఆకారమున భిన్నత్వము ఉండవలెను' అని కేశవచంద్రుడు ఘంటాపథముగా చెప్పెను.

"But this universality of my faith does not prevent it from being also *intensely* national. There is no conflict between these two aspects of religion. It is universal in its principles, in its main lines of action; but national and local in its external forms, its domestic and social usages, and its mode of propagation."

అని వచించి బ్రాహ్మసమాజము విశ్వజనీన ధర్మమనుసరించుచున్నను గృహ సాంఘిక ప్రచారక కార్యములందు జాతీయరూపమునె దాల్చునని శివనాథశాస్త్రి నొక్కి చెప్పిరి. బ్రాహ్మసమాజమున ఉపాసనావిధానము, కుటుంబ కర్మకలాపము, ప్రచారకమార్గము అన్నియు జాతీయపద్ధతినె జరగుచున్నవి. కాని అవి యింకను అధికముగ హిందూఆకారము దాల్చవలెనని మేము అభిలషించుచున్నాము. బ్రాహ్మసమాజికులయందు ధర్మజీవనము పెరిగినకొలది అట్లు పూర్తిగ జరుపగలదని విశ్వసించుచున్నాము. దేవేంద్రనాథుడు, కేశవచంద్రుడు, శివనాథుడు నడపిన బ్రాహ్మసమాజము విజాతీయమని యెవ రనగలరు? తోడిజనులకు అసమ్మతమైన సత్యములు కొన్ని చెప్పచుండుటచే, బ్రాహ్మసమాజము సనాతనీయము కాదని చెప్పనొప్పునా? బ్రాహ్మసమాజ స్థాపకులు జాతీయభావ పూరితులు; బ్రాహ్మసమాజము జాతీయసంస్థ అని మాత్రము అంగీకరింపక తప్పదు. దాని అనుచరులందలి లోపములను బట్టి దా~~నిని~~ దాని మూలపురుషులను గాని దూలనాడుట సరిగాదు. బ్రాహ్మసమాజోద్దేశము ఘనమైనది. దానికొరకు జీవనమర్పించిన మహనీయుల చరిత్రలు ఘనమయినవి. వానిని గురించి దేశీయులు చాల తెలిసికొనవలసియున్నది. వాని ఆధారమున తమ ధర్మజీవనము పెంపొందించుకొనవలసియున్నది. వాని నుండి వారలను విముఖులను జేయుటకు ఎవరును ప్రయత్నింపకుందురు గాక! ప్రకృత బ్రాహ్మసమాజకులు తమ సమాజోద్దేశమును మదినిలిపి తమ పితామహుల యడుగుజాడల నడచి వారి సంకల్పము నెరవేరుటకై తమ జీవితములు సాయపడుటకు యత్నింతురు గాక!

---

## బీదలకు గొప్ప మేలు:—

యుద్ధము ప్రారంభమయిన తరువాత పాశ్చాత్యఖండములందు మద్యపానము పూర్తిగ నిషేధింపబడెను. సహాయనిరాకరణోద్యమము మొదలిడిన పిమ్మట మన దేశమునందు ఇదివర కెన్నడును జరగియుండని రీతిని మద్యపానము సామాన్యజనులచే విడువబడుచున్నది. ఇది బీదల పాలిటికి గొప్ప మేలని చెప్పుటలో నతిశయోక్తి యేమియు లేదు. వచ్చు కొంచెము రాబడిని మద్యపానము నిమిత్తము దుర్వినియోగము చేసి తామును తమతోబాటు తమ కుటుంబములను దుఃఖసాగరమున ముంచు కూలివారెందరో గలరు. కలకత్తా మున్నగు నితర పట్టణములందె గాక మన ఆంధ్రదేశములో ఏలూరు, నూజవీడు మొదలగు గ్రామములందును మద్యపాన నిషేధము విరివిగా వ్యాపించుచున్నదని వినుటకు మే మెంతయు సంతోషించుచున్నాము. రాటముల నుపయోగించుట నేర్చి నూలు వడకుచుండినచో వారి ఆర్థికస్థితి మరింత చక్కబడును గాన, నూతనముగ కల్పింపబడిన యీవృత్తిని గూడ వారు వెంటనె యవలంబింతురు గాక! మహాత్మ గాంధి కొంత కాలము నూలు వడకుటకు వినియోగింపుడని యెల్లని గోరుచున్నారు. దాని సాధ్యాసాధ్యములు, ప్రయోజనములు విచారించుట రాజకీయ తంత్రజ్ఞులకె విడుచుచున్నాము. మద్యపాన నిషేధము, నూలు వడకుట బీదలకు మాత్రము చాల లాభకారులనుటకు సందేహము లేదు.

---

## ధూమకేతువు:—

ఈనెల (ఫిబ్రవరి) లో ధూమకేతు వొకటి మనకు గనబడనారంభించును. ఇది జూను నెల తే ౨౮ దీ వఱకును మనకు దృగ్గోచర మగుచుండును. దీని గమనమును బట్టి యయిదేసి సంవత్సరముల కొకమాఱు భూలోక వాసులకీ ధూమకేతువు దర్శన మిచ్చుచుండును. ఈమాఱీ ధూమకేతువు భూగోళమున కతి సమీపముగా నేతెంచి భూగోళ వాతావరణమున జొరబారి యాత్రసాగించును. ఇట్లు సమీపించిన మాత్రమున దీనివలన భూగోళమునకు ప్రమాదమేదియు గలుగనేరదు గాని రంగు రంగుల యగ్ని బాణములు (బాణాసంచా) నభోమండలమున ప్రజ్వలితము లగుచున్నవో యన నంతరిక్షమున వివిధ వర్ణముల జ్యోతిర్విశేష పరంపరలు నిండి ప్రకాశించుచు నంబరతలమును దేదీప్యమానముగా వెలిగించుచు దర్శనీయముగా బరిణమింప జేయును. ఇట్లని పశ్చిమఖండ వాసులగు జ్యోతిశ్శాస్త్ర పండితులు సిద్ధాంతము చేయుచున్నారు. చూడదగియుండును గదా!

(కల్పలత.)

---

# ఆది హిందూ మహాజనసభ.

———౦-౦:౦:౦-౦———

(బందరు శాఖ.)

సహాధ్యక్షులగు మా. వెం. భాగ్యరెడ్డిగారి ప్రారంభోపన్యాసమునందలి భాగములు :—

ఈ ఆందోళన యుగమున మనము చేయవలసిన ముఖ్యవిషయమును గూర్చి చర్చింపవలయును.

పరాజయము బొందిన జాతిపై జయించిన జాతివారలు కొంత కాలమువరకు మాత్రమే కఠినముగా ప్రవర్తింతురు. గాని హిందూప్రభువులు మనలను జయించి ఎంత కాలమైనది! మనకిప్పటికి ఏమైన మేరకలు కలిగినవా? ప్రపంచమున మనవంటి దుస్థితిలో నున్న జాతివారు నెచ్చటనైనా గలరా? మంచి మంచి ధాన్యము సౌధముల కొట్టములలో నింపవలయును. మనకు నాలిన్నాళ్ల బాధపడుచు పరితాపకాలములో ఆకలిబాధ తోర్చలేక పీనుగులు తినుచున్న మన్యోటి జాతి ఈ హిందూదేశములో తప్ప మరి యే ప్రాంతమునందైనా గలదా? మనల అన్నివిధముల బంధించి మన అసహ్య జీవనముల జూచి తిరస్కరించుచు చూచిన ద్రోహము కలుగునంచు వేష్టించు హిందూజాతికి పరమేశ్వరుడు ఎట్లు మేలుచేయగలడు? హిందువుల ప్రయత్నములకు భంగము కలుగుటకు కారణము మనవారి వేదనమే. ధనము గడించుటకు బోయిన దక్షిణాఫ్రికా హిందూసోదరులకు మావారిబాధలో శతాంశబాధ కలుగగానే గొప్ప ఆందోళనమును గావించి చందాలు పంపి వారి దుఃఖనివృత్తి గావించిరి. ఆదక్షిణాఫ్రికావారిని హిందువులు అందురు. వారి దుఃఖము లెటువంటివో తెలియును. అంతకన్న కఠినదుఃఖములను భరించుచున్న హిందువుల ప్రక్కలోనున్న ఆరుకోట్ల ప్రజలు అనేకరాత్రులు పీడింపబడుచున్నారో, రామచంద్రా! యని విలపించుచు హైందవుల తిరస్కారములతో తలయెత్తక కృషించుచును, తమ వేడిక నిట్టూర్పులతో హైందవయువకుల హృదయములకద నక్షి చేక మొరపెట్టుచు నీశ్వరుని కరుణను నిరీక్షించుచున్నారు.

ఓ కఠిన హృదయులారా! మీపెద్దలు దశావతారములలో నెందులో ప్రసిద్ధిజెందిరి. అట్టి వారి సంతానమై మీరేల భ్రష్టులైరి? ఎప్పటివరకు మా బానిసత్వము తొలగించరో, అప్పటివరకు మీ బానిసత్వము తొలగదనుమాట జ్ఞాపకమునం దుంచుకొందురు గాక! పూర్వము నొక్క బ్రాహ్మణుని చూపు కాని, అథవా స్పర్శగాని, ఒక్క పతితుని ఉద్ధరింపగలిగినదిగా నుండెడిది. ఇప్పటి (సెకండ్ హాండ్) బ్రాహ్మణోత్తములు ఒక పతితుని నీడపడిన తాము పతితుల మగుదుమని భయపడుచుందురు. ఓ పిరికిపందలగు హిందూ సోదరులారా! మమ్ము నుద్ధరించుటకు ముందుగ మీరు నుద్ధరింపబడుదురు గాక! మా వారిని మీ సంఘములో జేర్చుకొనుట యొక దయగల కార్యమని తలంపకుడు. అందుచే మిమ్ముల మీరు రక్షించుకొను కార్యము చేయుచున్నారమని భావింపుడు.

*　　*　　*

మొన్న మొన్నటి వరకు ఈర్ష్యాదృష్టితో జూడబడుచున్న మహమ్మదీయ సోదరులతో, స్వరాజ్యప్రాప్తికొరకు చేతులు కలుపుకొనుటకు సహించిన ఆచారపరులు, యికముందు మా యభివృద్ధిని నాటంకపరచబోరని నాకు దృఢనమ్మకము కలుగుచున్నది. ప్రస్తుత హిందువులలో నివసించు ప్రతిమానవుడు హైందవుడు. ఇందులో ప్రధమ నివాసులమగు మనము „ఆది హైందవులము”. శాస్త్రము ననుసరించి, ఆదిద్రవిడులని, ఆదిఆంధ్రులని, ఆది మహారాష్ట్రులని, మొదలగు నామములున్నను, మన జాతివారందరి పేరు మాత్రము ఆది హైందవులనియే యుండవలయును.

ప్రస్తుత హిందువులలో ముఖ్యముగ బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్యులవలె మనలో జాతిభేదములు పూర్వము లేకున్నను రాజ్యకార్యములు సాగించుటకు కొన్ని తరగతులు యేర్పడియున్నట్లు తెలియుచున్నవి. అందులో నాయకుడై రాజ్యము నేలువారలలో మహావీరత్వము జూపిన తెగ (మహార్స) అని మహారాష్ట్రములో పిలువబడుచున్న మాంగ్, అథవా మాదిగలను వారు కూడా విశేషముగ రాజ్యము లేలినట్లు తెలియుచున్నది. దీనికి శ్రీరామచంద్రుల కాలమున జాంబవంతుడు, అంగదుడు జూపిన శౌర్యమే సాక్షి. హిందూదేశమున మహాపతివ్రతా శిరోమణియై గగనమండలమున నక్షత్రరూపమున విరాజిల్లు అరుంధతీదేవి సంతానములగు హిందువులతో మాదిగలను పిలువబడు మన సోదరులు మారరు తోయరాదు. ఈజాతిభేదములు హిందూ చాదస్తు ఆచారము వలన మనకు నేర్చుకొనినవి. అనగా బదులుగా తెచ్చుకొనినవి. కావున మన యిరువురము సోదరభావముతో మెలగి అనవసరమైన పద్ధతులు విడనాడి సదాచారము నేర్చుకోవలయును. మన మేలును మనమే పాటుబడుచు ఐక్యముతో మెలగి మన యభివృద్ధి సాధన మనయవలయును. ముఖ్యముగా మనలను పీల్చి పిప్పిజేయుచున్న త్రాగుడు తక్షణం మానవలయును. జాతిభేదములు తొలగించి సోదరభావమున మెలగవలెను. గోమాంస భక్షణం తక్షణం శపథముతో మాని ముందుపద శాఖాహారపద్ధతి నవలంబించ ప్రయత్నించవలయును. ఈమూడు పద్ధతులు మన చేతిలోనివి. ఇందులో కృతార్థత గాంచినంగాని మనము వేరుగతిలేదు. మన ఆచరణశుద్ధియుక్తం గాని హైందవులతో పోరలేము. వారి సమానహక్కులు పొందుటకు అర్హతగలుగదు.

*　　*　　*

ప్రియ ఆదిహిందూ యువకులారా! మీరు దురభ్యాసములు వదలి విద్య సంపాదించుచు మన హక్కులు పొందేవరకు నిరంతరము పాటుబడుటకు శపథము చేయుడు. మన కులదేవతయగు జగదంబను ప్రార్థింపుడు. మనకు పలువిధముల సహాయము చేయుచు, కంటిరెప్పవలె కాపాడుటకు ప్రస్తుత మెందరో దేశభక్తులు బయలుదేరుచున్నారు. తమ స్వార్థమును విడనాడి మన కొరకు యెందరో బలియగుటకు ఎంతమంది సిద్ధము కానున్నారు. ఇట్టి సమయమున ధైర్యము వహించి ఆదిహిందూయువక జనసేవాసమితి నేర్పరచి, ఒక నిధి కూడా నేర్పరచి పాటుబడినచో తప్పక మనము జయము గాంతుము. ఆంధ్రదేశములో ౫౦ లక్షల ఆది ఆంధ్రులు గలరు. అందులో మాలలనువారు ౧౫,౦౦,౩౦౭ గలరు, ఇక మాదిగలనువారు ౯,౦౩,౯౯౬. రెండు కులములలో మొత్తము—౨౩,౧౮,౨౯౩ మంది గలరు.

ఇంతమంది నేకమై ఒక్క తల్లి బిడ్డవలె మెలగుదుమేని మనసాటి ఎవరుగలరు? ఇంత మందిలో ప్రతియింటికి నొక కాని చొప్పున నేర్పరచో మన ప్రయత్నములు సఫలములు నిడేర్పగదంగుదుము.

———

**The Dharma Sadhani Press,**

COCANADA.

---

***All Kinds of Job work***
***in***
**English & Telugu**
***Promptly and Neatly***
***executed.***

---

**CHEAPEST HOUSE**
**For School Books and Stationery etc.,**

# READY FOR SALE.

**S. S. L. C. Public Examination 1921.**

(1) Selections in English Prose & Poetry FOR DETAILED STUDY Complete Book Price Rs. 0-10-0.

(2) S. S. L. C. Telugu Text Book For A. and C. Group. For Detailed Study Price Rs. 1-0-0.

**S. S. L. C. Public Examination 1922.**

English Non-detailed Text Books. Anounced in advance to be used for V Form, in the Year 1920—21.

(1) Parables from Nature by Margaret Gatty. 0-12-0.

(2) Settlers in Canada by Captain Marryat. 0-11-0.

**T. P. VENKAYYA,**
**Book-Seller etc.,**
*COCANADA.*

# కేసరి—కుటీరము.

## లోధ్ర.

గర్భాశయ రోగనివారిణి.

స్త్రీలకు గలుగు బుఘశూల, బహిష్ఠ కాకుండుట, అకాల బహిష్టి, మైల జాస్తిగాను, తక్కువగానుపోవుట, కుసుమరోగము, సంతానహీనత, రక్తహీనత, మలబద్ధకము, సూతికావాతము, కీళ్ళనొప్పులు, అరికాళ్ళు, అరచేతులు మంట మొదలగు స్త్రీధర్మ వ్యాధులను కుదుర్చును. 24. డో రు. 5. 12 అవున్సుల బుడ్డి రు 3-0-0. 6 అవున్సుల బుడ్డి రు 1-10-0.

## అమృత.

రక్తశుద్ధి దాయకము.

ఇది రక్తహీనత, మలబద్ధకము, అజీర్ణము, కీళ్ళనొప్పులు, సోమరితనము, మేహవ్రణములు, సుఖసంకటములు, విస్ఫోటక, కడుపుబ్బు మంట మొదలగు వ్యాధులను నివారించి శరీరమునకు కాంతి ముఖమునకు తేజస్సును యిచ్చును. 24. అవున్సులు రు. ... 12అవున్సులు బుడ్డి రు 3-0-0. 6 అవున్సుల బుడ్డి రు 1-10-0

## అర్క.

సర్వజ్వర నివారిణి.

వాత, పిత్త, కఫ, విషమ, సన్నిపాతకొండ, మన్యసము న్న జ్వరములు జ్వరబిళ్ళ విషపడిశ మహాశ్చర్యముగ కుదుర్చును. 6 అ రు. 2-8-0; 3 అ రు 1-8-0; 1 అ 0-8-0.

కేసరికుటీరం, ఆయుర్వేద ఔషధశాల,
ఎగ్మోర్, మదరాసు.

---

# P. SUBBA ROY.

**Ayurvedic Pharmacy,**

*Sri Venkatesa Perumal koil Sannithy,*

TANJORE.

# పి. సుబ్బరాయి.

ఆయుర్వేద ఔషధశాల,

శ్రీవెంకటేశ పెరుమాళ్కొ సన్నిధి, తంజాపూరు.



25. షర్బత్తులు:—ద్రాక్షపండు, సపోటా నేరేడు, రోజా పుష్పము, అరటిపండు, నిమ్మపండు, దానిమ్మపండు, కిచ్చిలిపండు, బాదం, అనాసపండు, దగ్గోబ్జాపండు, సీమరేగుపండు, తామర పుష్పము, (సుగంధపాల) అల్లం మొదలైన మధురమైన ఫలాదుల రసములచే వైద్యశాస్త్రముల ననుసరించి చేయబడిన అపూర్వమయిన పానకములు వీటిని బొట్లుబొట్లుగా నుపయోగించిననే చాలును. పైకనిన నొక షర్బత్తులో యేదయిన 5 బొట్లను విడిచి ఒక శేరుచల్లని నీళ్ళలోగాని, సోడావాటరులోగాని చేర్చిన యెడల యేపండుయొక్క రసమునుంచి చేయబడినదో ఆపండుయొక్క వాసనతో కూడిన ఇంపైన పానకమగును. పెద్దబుడ్డిలోనుండి సాధారణముగా బజారులో అమ్మబడు షర్బత్తులకంటె వెయ్యిభాగము లు మేలైనది. ఇది అరడౌన్సు బుడ్డిలో అమ్మబడుచున్నది. 1 బుడ్డి షర్బత్తును 50 శేర్లనీళ్ళలోగాని సోడావాటరులోగాని చేర్చిన ఆరోగ్యమైన పానకమగును. పైషర్బత్తులలో నేదైనను వెల అరడౌన్సు బుడ్డి 1 కి అణాలు 8 1 మొదలు 3 సీసాలవరకు వి. పి. ఖర్చు అణాలు 7 ప్రత్యేకము.

---

బాల్లికి మందు.

పైన పూయవలసినది. ఒక నాడను వాడిన తప్పక గుణమిచ్చును. మంటయుండదు. మెల్లగా పనిచేయును. అన్నితత్వములకు సరిపడును. ఒక సీసా ఖరీదు రు 2—0—0. 1 మొదలు 3 సీసాలవరకు వి. పి, చార్జి 7 అణాలు అధికము. మావద్ద దొరకు ఆయుర్వేద ఔషధములయొక్క కేటలాగు కోరువారికి ఉచితముగా పంపబడును.

## అమృతాంజనము.

సుందరమైన **1921** ఉపయోగమైన

## క్రొత్తక్యాలండరు

విక్రియమునకు సిద్ధముగనున్నది.

క్యాలండరు వెల 1 కి 0-4-0 వి. పి. ఖర్చులు సహా 0-6-0

వెంటనె వ్రాసుకొనవలయును.

| లామర తైలము | పండ్లపొడి | మోహినీ తైలము |
|---|---|---|
| డబ్బి 1 కి, 0-6-0 | డబ్బి 1 కి, 0-2-0 | సీసా 1 కి, 0-12-0 |

## అమృతాంజనము

అన్ని నొప్పులకు దివ్యామృతము.

దగ్గు, శైత్యము, పడిశము, రొమ్ము పడిశము, తలనొప్పి, వాయువు నొప్పులు, పోట్లు,

జెణుకులు, బిళ్లలు, మొదలగు నొప్పులకు దివ్యామృతము.

చక్కని డబ్బితో సహా వెల రూ. 0-10-0. డజను 1 కి రూ. 6-0-0 పోస్టు ఖర్చులు వేఱు.

## అమృతాంజనము డిపో,

౧౦౯, ఫ్రీరోడ్డు, ఫోర్టు, బొంబాయి, ౬, తంబుశెట్టివీధి, మదాసు.



శ్రీమాన్ వైద్యరత్న పండిత

డి. గోపాలాచార్లుగారు స్థాపించిన

## ఆయుర్వేదాశ్రమము.

55, ఆచారప్పన్ వీధి, జార్జిటవున్, మదరాసు.

ఇందు, మామూలురీతిగా మందులు విక్రియింపబడును.

ప్లేగు, కలరా, ఇన్ఫ్లుయెంజా మున్నగు వ్యాధులకు ను. తదితర వ్యాధులకును మందులు దొరకును.

వ్యాధివివరములను వ్రాసిన, మందులు నిర్ణయించి పంపబడును.

కోరువారికి క్యాటలాగు ఉచితము.

ఎన్. మాధవమీనన్ (ఆయుర్వేదాచార్య)

తంతి విలాసము } డి. దేశికాచార్యులు,

'పండిట్', మదరాసు. } జాయింటు ప్రొప్రయిటర్లు.


## ధర్మసాధని.

ప్రకటన పద్ధతి.

| | 1 సం॥ | ½ సం॥ | ¼ సం॥ |
|---|---|---|---|
| 1 కాలము. | రు. 60 | రు. 40 | రు. 24 |
| ½ ,, | ,, 40 | ,, 24 | ,, 16 |
| ¼ ,, | ,, 24 | ,, 16 | ,, 12 |

ప్రకటన ద్రవ్యము ముందుగానె చెల్లింపవలెను.


**Reg. No. M. 1094.**

**The Dharma Sadhani, Cocanada.**

(Printed and Published by K. Hanumanta Rao, at the Dharma Sadhani Press, Cocanada.)


**V. P.** *Rs.* *As.* **To M. R. Ry.**



61 Jayanti Gaganna garu B. A., L. T.,

Head Master, V. H. School.